వీడని జంట హత్యల మిస్టరీ

- పోలీసులకు సవాల్‌గా మారిన కేసు
- పదికి పైగా పోలీసు బృందాల వేట
- వారమైనా దొరకని ఆధారాలు
- దర్యాప్తులో తీవ్ర గోప్యత పాటిస్తున్న పోలీసులు


హత్యకు గురైన దంపతులు (ఫైల్)

నో క్లూ..!



అంబర్‌పేట: డీడీ కాలనీ సాయిబాబానగర్ జంట హత్యల కేసు పోలీసులకు సవాల్‌గా మారింది. వారమైనా రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ లింగారెడ్డి మర్డర్ కేసు మిస్టరీ వీడటం లేదు. హత్య జరిగినప్పటి నుంచి పోలీసులు ఎన్ని కోణాల్లో దర్యాప్తు చేసినా చిన్న క్లూ దొరకడం లేదు. పది బృందాలు వందకు పైగా పోలీసులు వారం రోజులుగా దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే దాదాపు 10వేల సీసీ కెమెరాలను పరిశీలించారు. ఇంకా పరిశీలిస్తునే ఉన్నారు. అయినా వృద్ధ దంపతులు హత్య కేసును చేధించడంలో పోలీసులకు అనేక సవాళ్లు ఎదురువుతున్నాయి. ఎంతో అనుభవం ఉన్న పోలీసు అధికారులకు సైతం ఈ హత్య కేసు అంతుచిక్కడం లేదు. 24 గంటలు టాస్క్‌ఫోర్స్, సీసీఎస్, లా అండ్ ఆర్డర్ పోలీసులు బృందాలుగా ఏర్పడి కేసు చేధించేందుకు శ్రమ పడుతున్నా కొలిక్కి రాకపోవడం గమనార్హం.

మిస్టరీ ఎందుకు వీడటం లేదు.?

◆ 30 ఏళ్లుగా సొంత ఇంట్లో ప్రశాంత జీవనం గడుపుతున్న లింగారెడ్డి, భార్య ఊర్మిళదేవి దంపతులకు ముగ్గురు కూతుళ్లు. ఇద్దరు అమెరికాలో ఉన్నప్పటికి పెద్ద కూతురు సైతం అమెరికాలోనే ఉంది. ఇంట్లో వీరిద్దరు తప్ప సంబంధికులు ఎవరూ లేకపోవడం కేసుకు అవరోధంగా మారింది. అలాగే వీరి ఇంట్లో సీసీ కెమెరాలు లేకపోవడం పోలీసులకు క్లిష్టంగా మారింది. చుట్టుపక్కల సీసీటీవీ కెమెరాలు ఉన్నప్పటికీ వీరు ఉంటున్న ఇంటిని ఆ సీసీ కెమెరాలు కవర్ చేయడం లేదు. మొదట చోరీ కోసం హత్య జరిగిందని భావించిన పోలీసులు ఆ దిశగానే దర్యాప్తు చేశారు.

మొదట దొంగల పనే అనుకున్నారు కానీ..

◆ కాగా విషయం తెలుసుకొని అమెరికా నుంచి వచ్చిన కూతుళ్లను విచారించగా ఇంట్లో సొత్తు పూర్తిగా చోరీ కాలేదని తెలుస్తోంది. దీంతో పోలీసులు మరో కోణంలో దర్యాప్తు చేపట్టాల్సి వస్తోంది. చిల్లర దొంగలు కేవలం చోరీ కోసమే హత్య జరిగితే ఈపాటికి పోలీసులకు పట్టుబడే వాళ్లని అంతా భావిస్తున్నారు. ఎవరో తెలిసిన వారే ఈ హత్యలు చేశారని అనుమానిస్తున్నప్పటికీ పోలీసులు ఎవరిని ఎలా విచారించాలనే సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నారు. హత్యకు గురైన దంపతులకు ఉన్నత శ్రేణి సంబంధాలు ఉండటంతో పోలీసులు ఆచితూచి వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది.

మొత్తానికి ఈ కేసు అంతు చిక్కడం లేదు.

ఇంకా షాక్‌లోనే కాలనీవాసులు...

◆ నిత్యం కళ్లముందు ఉండే దంపతులు దుండగుల చేతిలో హత్యకు గురవడంతో చుట్టుపక్కల వారు ఆందోళనకు గురవుతున్నారు. సాయిబాబానగర్ వాసులు ఇంకా షాక్‌లోనే ఉన్నారు. హత్యకు గల కారణాలు తెలియకపోవడంతో అందరూ ఆందోళన చెందుతున్నారు. పదుల సంఖ్యలో పోలీసులు ఆ ఇంటి పరిసరాల్లో విచారిస్తున్నా కేసు కొలిక్కి రాకపోవడంతో స్థానికులు భయపడుతున్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు రిక్షాలు పంపిణీ


చెత్త రిక్షాల పంపిణీలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ వనం రమేష్

నల్లకుంట: నల్లకుంట డివిజన్ పరిధిలో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు శుక్రవారం జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో చెత్త రిక్షాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ వనం రమేష్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లల్లోని చెత్తను ఇంటింటికి వచ్చే చెత్త వాహనాల్లోనే వేయాలని సూచించారు. ఇష్టారాజ్యంగా వీధుల్లో పారవేస్తే పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతాయని అన్నారు. తద్వారా ఈగలు, దోమలు వృద్ధి చెంది రోగాలు ప్రబలుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ తిరుపతి నాయక్, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఇన్‌స్పెక్టర్ రాజునాయక్‌కు శుభాకాంక్షలు



ఇన్‌స్పెక్టర్ రాజునాయక్‌కు మొక్కను అందజేస్తున్న బీజేపీ నేతలు

చిక్కడపల్లి: చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన బానోతు రాజునాయక్‌ను శుక్రవారం బీజేపీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. అందరి సహకారంతో శాంతిభద్రతలు పర్యవేక్షణ సాధ్యమవుతుందని అన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు దోనేటి సత్యం, శివకుమార్, లక్ష్మీనారాయణ(బంటి) తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచాలి

ఉస్మానియా యూనివర్సిటీ: కులగణన నిర్వహించి బీసీలకు విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచాలని బీసీ నేత లింగంగౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం బీసీ కమీషన్ చైర్మన్ నిరంజన్‌కు వినతి పత్రం సమర్పించినట్లు ఆయన తెలిపారు. సమగ్ర కులగణన పై రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం కల్పించి పల్లె నుంచి పట్నం వరకు చేరుకునేలా ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. ఈ నెల 28 నుంచి చేపట్టిన బీసీ కమీషన్ క్షేత్రస్థాయి బీసీ కులాల అధ్యాయానికి అన్ని సంఘాలు సంపూర్ణంగా సహకరించాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ కల్లు గీత వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు అయిలి వెంకన్నగౌడ్, బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు దుర్గయ్య, మహిళ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు మణి మంజరి, ఉపాధ్యక్షురాలు సంధ్య తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకునేది శాస్త్రీయ పంటల బీమా


కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఆర్.రామ్‌కుమార్

ముషీరాబాద్: వాతావరణంలో అనిశ్చితస్థితి, పంట ఉత్పత్తి ఒడిదుడుకులలో రైతులను ఆదుకునేది శాస్త్రీయ పంటల బీమా అని టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ ప్రొ. ఆర్.రామ్‌కుమార్ అన్నారు. చైతన్య సేద్యం రైతుల మాస పత్రిక దశ వార్షికోత్సవాల సందర్భంగా ప్రతికూల వాతావరణ మార్పులు రైతు, పంటల బీమా అవసరాలు అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ప్రొ. అరబండి ప్రసాద్‌రావు రాసిన ప్రతికూల వాతావరణ మార్పులు, రైతుల దుస్థితి నివారణ పుస్తకాన్ని డాక్టర్ పీవీ అమర్‌నాథ్ ప్రసాద్ ఆవిష్కరించారు. ప్రొ. ఆర్.రామ్‌కుమార్ మాట్లాడుతూ.. దేశంలో పంటల బీమా పథకం రైతుల ఆదరణ పొందలేదన్నారు. దీనికి ప్రధాన కారణాలు బీమా పథకాలు రూపొందించి అమలు చేసే విధానంలో లోపాలు ఉన్నాయని అన్నారు. ప్రధానమంత్రి బీమా పథకం రైతులందరికి అమలయ్యేలా చూడాలన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి మంత్రి వద్దే శోభనాద్రీశ్వరరావు, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్, డాక్టర్ పద్మకర్‌రావు, సారంపల్లి మల్లారెడ్డి, పోతినేని సుదర్శనరావు, నంద్యాల నర్సింహారెడ్డి, పి.జంగారెడ్డి, మాదినేని రమేష్, బుర్రి శ్రీరాములు, వీరేపల్లి వెంకటేశ్వర్లు, వెంకటరెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు


రేణుకా ఎల్లమ్మ విగ్రహానికి అభిషేకం చేస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ ఆరెల్లి అంజయ్య

కాచిగూడ: చాదర్‌ఘాట్ రేణుకాఎల్లమ్మ దేవాలయం 25వ వార్షికోత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష అభిషేకం, 108 కళశ పూజలు, పూర్ణాహుతి, వశేష హారతి పూజలు జరిగాయి. సాయంత్రం శ్రీ లలితాదేవి సహస్రనామ పారాయణం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ అరెల్లి అంజయ్య, కాంగ్రెస్ పార్టీ నేత ఎ.సురేందర్, లక్ష్మీబాయి తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

నేడు చండీయాగం..

శనివారం ఉదయం 6గంటలకు అమ్మవారికి అభిషేకం, 7గంటలకు శ్రీ చండీయాగం, 12:30 గంటలకు విశేష హారతి, తీర్థ ప్రసాద వితరణ, సాయంత్రం 7 గంటలకు శ్రీ లలితాదేవి సహస్ర నామ పారాయణం ఉంటుంది. 27వ తేదీన ఆదివారం ఉదయం 6 గంటలకు పంచామృత అభిషేకం, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

ప్రొ.విజయలక్ష్మికి మహాత్మా గాంధీ గ్లోబల్ పీస్ అవార్డు


మహాత్మా గాంధీ గ్లోబల్ పీస్ అవార్డుతో విజయలక్ష్మిని సత్కరిస్తున్న ఎమ్మెల్సీ బండ ప్రకాష్

కాచిగూడ: బర్కత్‌పురలోని రాజా బహదూర్ వెంకటరామిరెడ్డి మహిళా కళాశాల కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జి.విజయలక్ష్మిని మహాత్మా గాంధీ గ్లోబల్ పీస్ అవార్డుతో ఘనంగా సత్కరించి అభినందించారు. తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్, ఎమ్మెల్సీ డాక్టర్ బండ ప్రకాష్, హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ బి.చంద్రకుమార్, రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్, ఎమ్మెల్సీ బుగ్గారపు దయానంద్‌గుప్తా, సుప్రీంకోర్టు అడ్వకేట్ డీఎల్ పాండు, తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్ తదితరులు పాల్గొని విజయలక్ష్మిని శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా జి.విజయలక్ష్మికి రెడ్డి మహిళా కళాశాల కరస్పాండెంట్ జి.సుదర్శన్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ జె.అచ్యుత దేవి, ప్రొఫెసర్ కె.ముత్యంరెడ్డి, డాక్టర్ జీవనజ్యోతి తదితరులు శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మత్తుల నిమిత్తం పలు ప్రాంతాలలో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీఈ నాగేశ్వర్‌రావు తెలిపారు. ఫీవర్ ఆసుపత్రి ఫీడర్ పరిధిలో అంజయ్య క్వార్టర్స్, తెలంగాణ యువతి మండలి, బర్కత్‌పుర పెట్రోల్ బంక్ తదితర ప్రాంతాలలో 11గంటల నుంచి 11.30 వరకు, లేపాక్షి ఫీడర్ పరిధిలో తపాడియా డయాగ్నస్టిక్ సెంటర్, గోల్కొండ సిగరెట్ ఫ్యాక్టరీ, లేపాక్షి తదితర ప్రాంతాలలో 11.30 నుంచి 12గంటల వరకు, వైఎంసీఏ ఫీడర్ పరిధిలో రెడ్డి కాలేజ్, చైతన్య కాలేజ్, తదితర ప్రాంతాలలో 11.30 నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

అర్హులకు చేయూత


సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికి చేయూతను ఇచ్చేందుకు తన వంతు సాయం చేస్తానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. అంబర్‌పేటకు చెందిన ఖాజా హమీదుదీన్‌కు చికిత్స కోసం సీఎం రిలీఫ్ ఫండ్ పథకం కింది మంజూరైన రూ.లక్ష ఎల్‌ఓసీ పత్రాన్ని శుక్రవారం ఎమ్మెల్యే నివాసంలో అందించారు. నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందేందుకు మంజూరైన పత్రం ఆర్థికంగా అండగా ఉంటుందన్నారు.

ఓయూలో జాతీయ సదస్సు ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవారం రెండు రోజుల జాతీయ సదస్సు ప్రారంభమైంది. కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.చంద్రశేఖర్ అధ్యక్షత వహించగా వీసీ ప్రొ. కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం సదస్సు సావనీర్‌ను ఆవిష్కరించారు.

నవంబర్ 24న వచన కవిత అధ్యయన శిబిరం

సుల్తాన్‌బజార్: తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో నవంబర్ 24న వచన కవిత్వ అధ్యయన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే కవిత్వ రంగంలో కొంత కృషి చేసిన వారికి వస్తు, శిల్ప పరమైన శిక్షణ ఇచ్చేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కవులు ఇప్పటి వరకు వెలువరించిన కవితల వివరాలు తెలియజేస్తూ మచ్చుకు ఒక కవితను 96037 27234 వాట్సాప్ నెంబర్‌లో పంపి నమోదు చేసుకోవాలని సూచించారు. సీనియర్ కవులు, విమర్శకులు, ఈ శిబిరంలో కవిత్వ నిర్మాణ పద్ధతుల గురించి కవిత్వంలో ఉండాల్సిన ప్రామాణిక అంశాల గురించి వివరిస్తారని డాక్టర్ జె.చెన్నయ్య తెలిపారు.

నేడు సత్కళాభారతి వార్షికోత్సవం

గన్‌ఫౌండ్రీ: సత్కళాభారతి 28వ వార్షికోత్సవ వేడుకలను ఈ నెల 26న రవీంద్రభారతిలో నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు సత్యనారాయణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి పుష్పగిరి పీఠాధిపతి అభినవోద్దండ విద్యాశంకర భారతిస్వామి, ప్రభుత్వ పూర్వ సలహాదారులు కేవీ.రమణాచారితో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా 100 మంది వేద పండితులకు ఘనంగా సత్కారం చేయనున్నట్లు తెలిపారు.

ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకోవాలి


కమలానెహ్రూనగర్‌లో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: ప్రతి ఒక్కరూ సేవా భావంతో పాటు అధ్యాత్మిక భావనను అలవర్చుకున్నప్పుడే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శుక్రవారం ముషీరాబాద్ డివిజన్‌లోని కమలా నెహ్రూనగర్‌లో ప్రజా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆకుల అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఇటీవల ఏర్పాటు చేసిన దుర్గామాత ఒడి బియ్యంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ హాజరై స్థానికంగా ఉన్న బద్దిపోచమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. పేదలకు అండగా ఉంటూ వారి అవసరాలను తీర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, నాయకులు టెంట్ హౌజ్ శ్రీనివాస్, డి.శివముదిరాజ్, దీన్‌దయాల్ రెడ్డి, ముచ్చకుర్తి ప్రభాకర్, బీమర్తి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

హరాస్‌పెంట శ్మశానవాటికపై పోలీసు నిఘా పెంచాలి

హిందూ శ్మశానవాటిక ప్రబంధక సమితి ఛైర్మన్ ఎస్.గోపాల్‌రావు



కాచిగూడ: హరాస్‌పెంటలోని హిందూ శ్మశాన వాటిక సంఘ విద్రోహ శక్తులకు అడ్డాగా మారిందని.. దీంతో నిత్యం శ్మశానవాటిక వద్ద దొంగతనాలు, గొడవలు జరుగుతున్నాయని హిందూ శ్మశానవాటిక ప్రబంధక సమితి చైర్మన్ ఎస్.గోపాల్‌రావు తెలిపారు. శుక్రవారం నింబోలిఅడ్డలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఇటీవల రూ. 4.50లక్షల వ్యయంతో 18 సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తే అందులో మెయిన్ కెమరాను పగులగొట్టారని అన్నారు. విద్యుత్ వైరును కట్ చేసి ఎత్తుకెళ్లారని పేర్కొన్నారు. పత్తాల ఆటగాళ్లు, గంజా బ్యాచ్, తాగుబోతుల బెడద, దొంగతనాలు పెరిగిపోతున్నాయని తెలిపారు. అక్కడి సిబ్బందిపై దాడులు జరుగుతున్నాయని తెలిపారు. పోలీసులు హిందూ శ్మశాన వాటిక వద్ద నిఘా పెంచి, నిత్యం గస్తీ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రత్యేకంగా బ్రహ్మణ అపర కర్మల భవనాన్ని ఏర్పాటు చేసి, దహన సంస్కారాల కార్యక్రమాలను నిర్వహించడానికి 2వేల చదరపు గజాలతో నూతన హాల్‌ను నిర్మించినట్లు తెలిపారు.

సదర్ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత అభిషేక్ కెనడీ

చిక్కడపల్లి: మాజీ ఎంపీ ఎం.అంజన్‌కుమార్‌యాదవ్, రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్‌ల ఆధ్వర్యంలో ఈనెల 27న తెలంగాణ సదర్ సమ్మేళనం జరుగునుంది. రాజకీయ, కులమతాలకు అతీతంగా పాల్గొని విజయవంతం చేయాలని కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు అభిషేక్ కెనడీ, నేతలు గుర్రం శంకర్, సురేష్‌కుమార్‌యాదవ్‌లు అన్నారు. శుక్రవారం సాయంత్రం వారు డివిజన్‌లోని జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో మాట్లాడారు.ఈ నెల వివేక్‌నగర్ ఆంజనేయస్వామి దేవాలయం నుంచి ర్యాలీ ప్రారంభం అవుతుందని అన్నారు. ర్యాలీలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నేతలు మారిశెట్టి నర్సింగరావు, నరేందర్, గుండు జగదీశ్‌బాబు, ఎంటీ కృష్ణయాదవ్, వెంకటరమణ యాదవ్, గడ్డం రాజేష్, శంకర్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

చదువుల సరస్వతికి ప్రతిరూపం పులిగడ్డ విజయలక్ష్మి

డాక్టర్ కేవీ రమణాచారి

చిక్కడపల్లి: జీవితంలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని బాల్యవివాహం చేసుకున్నా చదువుకోవాలనే లక్ష్యంతో డాక్టరేట్ పొంది ఆచార్యులుగా ఉద్యోగ విరమణ చేసిన పులిగడ్డ విజయలక్ష్మి చదువుల సరస్వతికి ప్రతిరూపమని డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. త్యాగరాయ గానసభలో శుక్రవారం రాత్రి సాహితీ జిగీష సాహిత్య సంస్థ ఉపాధ్యక్షుడు కవి రఘుశ్రీ నిర్వహణలో ఆచార్య పులిగడ్డ విజయలక్ష్మి సహస్ర పూర్ణచంద్ర దర్శనం పేరిట 82ఏళ్ల జన్మదిన వేడుక సాహిత్య సమ్మిళితంగా జరిగింది.

◆ ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ కేవీ రమణాచారి మాట్లాడుతూ.. తల్లిని గురువుగా భావించే సంప్రదాయంతో కుమార్తెలు విజయలక్ష్మి జన్మదినం శోభాయమానంగా జరిపడం అభినందనీయమని అన్నారు. సాహితీ వేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం మాట్లాడుతూ... విజయలక్ష్మి జీవితం నేటి మహిళలందరికీ స్ఫూర్తి కావాలన్నారు.


ఆచార్య పులిగడ్డ విజయలక్ష్మి సన్మానిస్తున్న డాక్టర్ కేవీ రమణాచారి, వోలేటి పార్వతీశం

ధర్నాకు తరలిన బీజేపీ శ్రేణులు



అంబర్‌పేట: మూసీ బాధితుల కోసం బీజేపీ చేపట్టిన ధర్నాకు అంబర్‌పేట నియోజవర్గం నుంచి ఆ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. శుక్రవారం ఇందిరాపార్క్ వద్ద నిర్వహించిన ధర్నాకు ఆ పార్టీ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, చూక్క జగన్, బాలు తదితరులు భారీగా తరలివెళ్లారు.

నల్లకుంట నుంచి మహాధర్నాకు..

నల్లకుంట: మూసీ బాధితులకు అండగా కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఇందిరాపార్క్ వద్ద మహా ధర్నా చేపట్టారు. ఈ ధర్నాలో నల్లకుంట నుంచి బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ వనం రమేష్, బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి ఎంబీ. కిశోర్ కుమార్, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు కె. లక్ష్మణ్ కుమార్, సెంట్రల్ జిల్లా ఎగ్జిక్యూటీవ్ మెంబర్ కేజే బాబు, ఓబీసీ మోర్చా ఎగ్జిక్యూటీవ్ మెంబర్ ఎం. మధుసూదన్, ఎస్సీ మోర్చా నియోజకవర్గ కన్వీనర్ మంగి శివకుమార్, డివిజన్ నాయకులు సురేష్ యాదవ్, జి.గోపాల్, వెంకటేష్‌గౌడ్, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు.


మహా ధర్నాలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్ వనం రమేష్ తదితరులు

ప్లాస్టిక్, తోళ్ల మండీలకు నోటీసులు జారీ


భోలక్‌పూర్‌లో టౌన్‌ప్లానింగ్ అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ గౌస్ ఉద్దీన్

ముషీరాబాద్: భోలక్‌పూర్‌లో జనావాసాల మధ్య ఉన్న ప్లాస్టిక్, తోళ్లమండీలను తొలగించాలని జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు శుక్రవారం నోటీసులు జారీ చేసేందుకు వచ్చారు. స్థానిక వ్యాపారులు ఈ విషయాన్ని కార్పొరేటర్ గౌస్ ఉద్దీన్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే ఆయన ఘటన స్థలానికి చేరుకొని అధికారులతో మాట్లాడారు. వృత్తినే నమ్ముకుని జీవిస్తున్న చిరువ్యాపారుల ఉపాధిని దెబ్బతీసేందుకు ప్రయత్నించొద్దని అన్నారు. స్థానిక వ్యాపారులతో మాట్లాడి నిర్ణయం ప్రకటిస్తామని అప్పటి వరకు నోటీసులు జారీ చేయవద్దని విజ్ఞప్తి చేశారు. దీంతో అధికారులు భోలక్‌పూర్ నుంచి వెనుదిరిగి వెళ్లిపోయారు.

గచ్చిబౌలిలో హౌసింగ్ సొసైటీ సమస్య పరిష్కారానికి సీఎం హామీ

భాగ్యనగర్ టీఎన్జీవోస్ గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు డా. సత్యనారాయణగౌడ్



కాచిగూడ: ప్రభుత్వ ఉద్యోగులకు అప్పటి వైఎస్సార్ ప్రభుత్వం గచ్చిబౌలిలో హౌసింగ్ సొసైటీకి కేటాయించిన ఇళ్ల స్థలాల సమస్యను మంత్రివర్గ ఉప సంఘం ద్వారా చర్చించి పరిష్కరించే విధంగా కృషి చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని భాగ్యనగర్ టీఎన్జీవోస్ గచ్చిబౌలి హౌసింగ్‌సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ ఎం.సత్యనారాయణ గౌడ్ తెలిపారు. శుక్రవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో హౌసింగ్ సొసైటీ కార్యవర్గ సభ్యులతో కలిసి ఆయన మాట్లాడారు. ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధానకార్యదర్శి ముజీబ్ హుస్సేన్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస్‌రావులతో కూడిన ప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి ఉద్యోగుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారని తెలిపారు. భాగ్యనగర్ టీఎన్జీవోస్ గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ విషయమై ముఖ్యమంత్రితో చర్చించామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్యోగుల బాధలను అర్థం చేసుకుని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. నవంబర్ 6వ తేదీన ఆర్టీసీ కళ్యాణ మండపంలో హౌసింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి జి.మల్లారెడ్డి, ఎ.శ్రీనివాస్, రాజేశ్వర్ రావు, ఎస్.ప్రభాకర్ రెడ్డి, ఎం.శ్రీనివాస్ రావు, శ్రీధర్ రెడ్డి, అమరజ్యోతి, కేసియా నాయక్, సంధ్య, నర్సింహ్మా రాజు తదితరులు పాల్గొన్నారు.